క్లుప్తంగా

శుద్ధజల ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్ ప్రారంభిస్తున్న సంతోష్‌గౌడ్

దహెగాం: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలం అందిస్తామని మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవాజీగూడ గ్రామంలో రూ. 5 లక్షల ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీబ్రా సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో వెన్నెల

దహెగాం: నూతనంగా పట్టా పాస్‌బుక్ కలిగిన వారు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో వెన్నెల అన్నారు. మంగళవారం మండలంలోని ఐనం గ్రామ పంచాయతీలోని రైతుల వద్ద నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బెజ్జూర్: రైతుబీమా పథకానికి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 5వ తేదీలోగా చేసుకోవాలని ఏఈవో మారుతి అన్నారు. మంగళవారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. గ్రామ సర్పంచ్ భీంరావు, కారోబార్ జలపతి, సిడాం సకారాం రైతులు పాల్గొన్నారు.

రెబ్బెన: అర్హులైన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో సుకన్య అన్నారు. మంగళవారం గోలేటి గ్రామపంచాయతీ కార్యాలయంలో అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ సుమలత, ఎంపీటీసీ సాగరమ్మ, కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

అన్నాభావు సాఠే జయంతి



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో మంగళవారం అన్నభావుసాఠే జయంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ తాలుకా కార్యదర్శి కామెర బాబాజీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఆశన్న, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్థలం కోసం వినతి

భీమారం: మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణానికి స్థలం తక్కువగా ఉందని, మరికొంత స్థలం కేటాయించాలని స్థానిక యువత మంగళవారం తహసీల్దార్ వాసంతిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు వెంటనే ఆమె స్పందించి సర్వేయర్‌ను అక్కడికి పంపించారు. భూమిని సర్వే చేసి తగిన వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : బ్రో
కాగజ్‌నగర్
వెంకటరమణ : బ్రో

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.200
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

'పత్తి'లో సస్యరక్షణ చర్యలు

- వరదలతో పత్తి చేనుల్లో నీరు నిల్వ
- పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం
- ఆందోళన వద్దంటున్న అధికారులు
- యాజమాన్య పద్ధతులపై అవగాహన



వీర్దండిలో ఎర్రబడిన మొక్కలను చూపుతున్న రైతు

కౌటాల: ఏటా పత్తి విత్తనాలు వేసిన మొదలు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలో వరదనీరు నిలవడంతో పత్తి మొక్క ఎదుగుదల లోపించడంతో పాటు మొక్కలకు ఎండు తెగులు సోకుతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

ఆది నుంచే అవస్థలు..

ఈసారి ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 3.51 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. భారీ వర్షాలతో పత్తి పంటల్లో వరద నీరు నిల్వ ఉండడంతో ఏం చేయాలో తోచక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా పత్తి మొక్కల్లో ఎదుగుదల లోపించింది. చెలక, నల్ల రేగడి భూముల్లో మొక్కలు ఎర్రబడ్డాయి. గడ్డి సైతం విపరీతంగా పెరిగింది. మొక్కలకు వేరు తెగులు, ఆకు రాలిపోవడం వంటి తెగుళ్ల ఉధృతమయ్యే అవకాశం ఉంది. దీంతో పత్తి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు..

- ప్రస్తుతం 30 నుంచి 40 రోజుల దశలో పత్తి పంట ఉన్నందున నిలిచిన నీటిని కాలువల ద్వారా బయటకు పంపాలి.
- చేను తడారిన అనంతరం అంతర కృషి కుదరకపోతే వెడల్పాకు కలుపు అధికంగా ఉంటే పైరిథయోబ్యాక్ సోడియం 250 ఎంఎల్, గడ్డిజాతి కలుపు ఉంటే క్విజోఫాఫ్ ఇథైల్ 400 ఎంఎల్, రెండు రకాల కలుపు ఉంటే రెండు మందులు కలిపి 500 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- భూమిలో నీటి తేమశాతం ఎక్కువగా ఉండడం కారణంగా మొక్కలు పోషకాలను గ్రహించవు. దీని కోసం కరిగే ఎరువులైన 19:19:19 10 గ్రాములు, లేదా మల్టీకే (13-0-45) 10 గ్రాములు, యూరియా 20 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలుపుకొని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- చీడపీడల ఉధృతి పెరగకుండా కర్బాండిజమ్ 2.5 గ్రాములు, మాంకోజెబ్ లేదా పిప్రోనిల్ 2 మి.లీ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- అధిక వర్షాల కారణంగా తెగులు సోకే అవకాశం ఉందని, దీని కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- అధిక వర్షాల వల్ల ఆకులు పసుపు లేదా ఎరుపు రంగులో కనిపిస్తాయి. దీని నివారణకు లీటర్ నీటికి 10గ్రాములు, యూరియా, 10 గ్రాములు ల్ఫేట్ కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

పత్తి పంట ఎర్రబడింది



మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీటిలో పంట మునిగింది. వరద తగ్గడంతో చేనులోని మొక్కలపై బురద మాత్రమే మిగిలింది. కొన్ని మొక్కల్లో ఎదుగుదల లేదు. మరికొన్ని మొక్కలు ఎండిపోతున్నాయి. ఎం చేయాలో తోచడం లేదు.

- పర్బాకే జానకిరాం, రైతు, వీర్దండి

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు పంట చేనుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నీరు నిలిస్తే పత్తి మొక్క ఎర్రబడడంతో పాటు మురిగిపోతుంది. అధిక తేమ శాతంతోనే మొక్కల్లో ఎదుగుదల లోపించింది. రైతులు ఆందోళన చెందవద్దు. పత్తి పంటలో సస్యరక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- పి.రాజేశ్, ఏవో, కౌటాల

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



తిర్యాణి: ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు



కౌటాల: మద్దతు తెలుపుతున్న అంగన్‌వాడీలు

తిర్యాణి: గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె మంగళవారం 27వ రోజుకు చేరుకుంది. భవన నిర్మాణ కార్మికులు పంచాయతీ కార్మికులకు మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. కార్మికులు తిరుపతి, రవి, జంగు తదితరులు ఉన్నారు.

కౌటాల: కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 27వ రోజు కొనసాగింది. కార్మికుల సమ్మెకు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు సమ్మెలో పాల్గొని మద్దతు పలికారు. నాగేశ్, ప్రకాశ్, బానీత్, రాజారం, లింగయ్య పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండి వాగుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, తహసీల్దార్ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న పర్సనల్ డిపార్టుమెంట్ సిబ్బంది

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్‌లో సీనియర్ పీవోగా పని చేసి కార్పొరేట్ వెల్ఫేర్‌కు బదిలీపై వెళ్తున్న కిరణ్‌కుమార్‌ను మంగళవారం పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కిరణ్‌కుమార్ చేసిన సేవలు ఎప్పటికి నిలిచి ఉంటాయన్నారు. కార్యక్రమాల నిర్వహణ, విధుల పట్ల అంకిత భావం ఆయనకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్, డీవైపీఎం తిరుపతి, జూనియర్ అసిస్టెంట్ బాబా, రమ్య, తిరుమల, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి కదనభేరి'కి తరలిన ఏబీవీపీ నాయకులు



సభకు బయల్దేరిన నాయకులతో హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లో తలపెట్టిన తెలంగాణ విద్యార్థి కదనభేరి బహిరంగ సభకు కాగజ్‌నగర్ పట్టణం నుంచి ఏబీవీపీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. సభకు విద్యార్థులు ప్రత్యేక బస్సులో వెళ్తుండగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు.

పాత విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న బాలకిషన్

ఆసిఫాబాద్‌అర్బన్: భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డుతోపాటు ఇన్సూరెన్స్ కార్డు విషయంలో పాత విధానం అమలు చేయాలని భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో కార్మికులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డు జారీలో వేలిముద్ర విధానాన్ని అమలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్మికుల కష్టాన్ని తొలగించేందుకు వెంటనే పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, హాజరైన కార్మికులకు ప్రత్యేక సర్టిఫికెట్ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కమలాకర్, జిల్లా కోశాధికారి ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీటీడీవోకు సిబ్బంది సన్మానం



డీటీడీవో రమాదేవిని సన్మానిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల నూతనంగా డీటీడీవోగా బాధ్యతలు తీసుకున్న రమాదేవిని మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు డీటీడీవో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఏటీడీవో క్షేత్రయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నెన్నెల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చూడాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల మండల స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు.

ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా జరుపుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. జైనూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆదివాసీల అస్తిత్వం కోసం ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్‌కు చెందిన ఆదివాసీ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మెస్రం మోతీరాం, కనక వెంకటేశ్వర్, అంబాజీ, భీంరావు, నాగోరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఎన్ఎంల నియామకంలో బీసీలకు అన్యాయం'

ఆసిఫాబాద్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంలో బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, యువజన సంఘం నాయకులు ప్రణయ్ అన్నారు. ఈ విషయమై మంగళవారం జిల్లా కేంద్రంలో డీటీడీవోను కలిసి మాట్లాడారు. ఏఎన్ఎంల నియామకంలో ఒక్క బీసీ మహిళకు కూడా అవకాశం ఇవ్వలేదని, అలాంటప్పుడు దరఖాస్తులు ఎందుకు స్వీకరించారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు మారుతి పటేల్, తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి



భిక్షపతిని సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా సాపవత్ భిక్షపతిని మంగళవారం నియమించారు. భిక్షపతి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్, ఆదివాసీ మండల అధ్యక్షుడు రాజారాం, రెబ్బెన సర్పంచ్ సతీష్, మండల కార్యదర్శి మురళీధర్ గౌడ్, నారాయణ, సుందర్, చంటి, సంజు, రుషి, బషీర్ ఖాన్, శంకర్, శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విమలబాయి

వాంకిడి: అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ ముండె విమలబాయి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకృతిలో నెలకొన్న వైపరీత్యాలు, విపత్తులపై ఎంపీపీ అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీవో శివకుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రవణ్, వైద్యాధికారి ఉప్రె వినయ్, ఏపీవో శ్రావణ్‌కుమార్, కేపీ ఏపీఎం మహేష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు వరం



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి మధుకర్

వాంకిడి: ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు వరమని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌పై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ సందర్భంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను సైన్స్ ప్రాజెక్టులకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీ ప్రాజెక్టుపై కేంద్రం రూ.10 వేలు కేటాయించిందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీటు కేటాయిస్తారన్నారు. ఈనెల 7వ తేదీలోగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఎంఈవో మనుకుమార్ అన్నారు. రిసోర్స్ పర్సన్‌లు తిరుపతయ్య, లక్ష్మణ్ ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రెబ్బెన: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు తాహేర్‌లు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సర్పంచ్ అహల్యాదేవి, ఎంపీటీసీ మదునయ్య, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, సుదర్శన్‌గౌడ్, ఆనంద్, దుర్గం రాజేష్, జహురోద్దీన్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం



పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో జె.రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఎంఐఎం తదితర పార్టీల నాయకులతో రానున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లు, ఓటరు జాబితా తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. సమావేశంలో తహసీల్దార్ మునవ్వర్ షరీఫ్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మండల కోఆప్షన్ సభ్యుడి రాజీనామా



రాజీనామా పత్రం అందిస్తున్న సాజిత్

పెంచికల్‌పేట్: మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాజిత్ మంగళవారం పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గంగాసింగ్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. అధికారుల పనితీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



పెంచికల్‌పేట్: అవగాహన కల్పిస్తున్న నేహా



కెరమెరి: మాట్లాడుతున్న రెబ్కా

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి నేహా మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ముర్రు పాలల్లో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. డబ్బా పాలు తాగించకూడదని తెలిపారు. గర్భిణులు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: పుట్టిన బిడ్డకు తల్లిపాలు (ముర్రుపాలు) తాగించాలని ఐసీడీఎస్ సీడీపీవో రెబ్కా అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. బిడ్డకు పాలిచ్చేటప్పుడు తల్లి శుభ్రతను పాటించాలన్నారు. సరైన పద్ధతిలో పాలివ్వాలని, డబ్బా పాలు పట్టకూడదని పేర్కొన్నారు. బిడ్డ పుట్టగానే వెచ్చగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కుమారి, కార్యకర్తలు ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ బహిరంగ క్షమాపణ

బెజ్జూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలకు గాను పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్ బహిరంగ క్షమాపణ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ప్రెస్‌మీట్‌లో తాను చేసిన వ్యాఖ్యలతో ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయన అభిమానులను బాధించి ఉంటే మన్నించాలని పేర్కొన్నారు.